ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

# రాయలసీమ అభ్యుదయ కవిత్వం – శిల్పవిశిష్టత

ధర్మకారి అశోక్ బాబు

కె.ఎస్.ఓ.యు. పరిశోధక విద్యార్థి,మైసూరు.

Article Received: 15/11/2025
Article Accepted: 29/12/2025
Published Online: 30/12/2025
DOI:10.53414/Sahithyatharangini.2025.24167

సాహిత్యంలో అనేక ప్రక్రియలున్నాయి. కథానిక, నవల, వచనకవిత, మినీకవిత, గేయం వంటివన్నీ సాహిత్యప్రక్రియలే. ప్రతి ప్రక్రియకూ ఒక ప్రత్యేకలక్షణం ఉంటుంది. ఎంపిక చేసుకున్న వస్తువు తదనుగుణమైన రూపంలో అంటే ప్రక్రియలో పాఠకునికి సులభంగా, ఆకర్షణీయంగా చేరగలిగేలా రచయిత పొందుపరుస్తాడు. ఈ పనితనాన్నే శిల్పం అంటారు.

ఆంగ్లంలోని టెక్నిక్ (Technique) అనే పదానికి సమానార్థకంగా తెలుగులో శిల్పం అనేమాట ప్రయోగంలో ఉంది. "తీసుకున్న వస్తువును అందించే విధానమే శిల్పం" అని సాహిత్య నిఘంటువులు తెలియజేస్తున్నాయి.

ప్రక్రియ ఏదైనా కావచ్చు ఒక రచయిత తన రచనలో ఏం చెప్పాడన్నది వస్తువు. ఎలా చెప్పాడన్నది శిల్పం. ఈ వస్తు శిల్పాలకు సమన్వయం సిద్ధించినప్పుడే ఆ రచన సాహిత్యం గౌరవం పొందుతుంది. రూపం ప్రక్రియ - వస్తువు ఈ మూడింటిని కవి వ్యక్తిగత "భావప్రకటన ప్రతిభ" కాంతి పరివేషంలాగా ఆవరించి ఉంటుంది. సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధానమైన భావం వస్తువు. అంటే రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువు అనవచ్చు. ఈ వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు.

రచయిత స్వీకరించిన వస్తువును బట్టి ప్రక్రియ ఉంటుంది. ఒక్కొక్క ప్రక్రియను బట్టి ఒక్కో శిల్పం ఉంటుంది. కథాశిల్పం వేరు, నవలాశిల్పం వేరు. మళ్లీ యీ కవితాశాఖలో పద్యకవిత్వం, వచనకవిత్వం, మినీకవిత్వం, గేయం, హైకూ వంటి అనేక ప్రక్రియలు ఉన్నాయి. వీటన్నింటికి శిల్పాలు వేరువేరుగా ఉంటాయి.

ఆధునికులు ముఖ్యంగా అభ్యుదయవాదులు వస్తుశిల్పాలలో వస్తువుకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఎందుకంటే సామాజికజీవితంలో వచ్చే ప్రతి చిన్నమార్పు ప్రధానంగా వస్తువులోనే మార్పు తెస్తుంది. అలాగని అభ్యుదయవాదులు శిల్పాన్ని విస్మరించలేదు. ఎందుకంటే ఏ వస్తువుపైనా

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

అది రూపాన్ని ఆశ్రయించుకునే వ్యక్తం అవుతుందని, వస్తువుయొక్క అస్తిత్వం రూపాన్ని ఆశ్రయించుకునే ఉంటుందని వారికి తెలుసు.

రాయలసీమ అభ్యుదయకవిత్వరచనాశిల్పాన్ని, వస్తుశిల్పం, భావశిల్పం, రచనాశిల్పం అని వర్గీకరించి పరిశీలించవచ్చు.

**వస్తు శిల్పం:** వస్తువుకు సంబంధించిన శిల్పాన్ని వస్తుశిల్పం అంటారు. వస్తు నిర్వహణే వస్తుశిల్పం అవుతుంది. కేవలం ఒకే వస్తువును కాకుండా భిన్నవస్తువుల్ని స్వీకరించి వాటిని నిర్వహించడం వస్తుశిల్పం అవుతుంది. ఈ వస్తుశిల్పాన్ని ఇతివృత్త నిర్వహణ అని కూడా అంటారు. ఒకే వస్తువుని భిన్న కవులు భిన్నభిన్నంగా నిర్వహించడాన్ని కూడా మనం గమనించగలం.

రాయలసీమ అభ్యుదయ కవిత్వంలో ప్రధానవస్తువు రాయలసీమ కరువుకాటకాలే. రాయలసీమలో వర్షాభావం, పంటలు ఎండిపోవడం, పశువులకు గడ్డి లేకపోవడం, రైతులు ఆకలితో అల్లాడడం, త్రాగడానికి నీరులేకపోవడం, పశువులు అమ్ముకోవడం, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడం, రైతులు వర్షం చుక్క కోసం ఎదురుచూడడం, ముఠా తగాదాలు, కక్షలు, కార్పణ్యాలు రాయలసీమలోని రాజకీయాలు, నిరుద్యోగం ఎన్నో అంశాలు ఇతి వృత్తాలుగా నిర్వహించడం మనకు కన్పిస్తుంది. వీటితోపాటు ఆంధ్రదేశంలోనూ, భారతదేశంలోనూ, ఒకటిన్నర దశాబ్దాలుగా సంభవించిన పరిణామాలను ఇతివృత్తాలుగా స్వీకరించివున్నారు. వీటితోపాటు సాంఘిక అంశాలు, రాజకీయ అంశాలు, ఆర్థిక అంశాలు, నైతిక అంశాలు, సాంస్కృతిక అంశాలు, ప్రకృతిగత అంశాలు, ప్రాపంచిక అంశాలు లాంటి యితర అంశాలను కోకొల్లలుగా రాయలసీమ అభ్యుదయ కవులు తమ కవిత్వంలో ఇతివృత్తాలుగా తీసుకొని వాటిని ఎంతో వైవిధ్యంతో నిర్వహించడాన్ని మనం గమనించవచ్చు.

ఈ నేపథ్యంలో రెండుదశాబ్దాల కిందటే సీమకవిత' పేరుతో ఒక అభ్యుదయ కవిత్వం సంపుటి వెలువడింది. ప్రొద్దుటూరుకు చెందిన 'మిత్రజ్యోతి' సంస్థ దీన్ని సంకలనంగా చేసి, తెచ్చింది. ఈ కవితాసంపుటి ఆధారంగా సీమాభ్యుదయ కవుల వస్తుశిల్పంగా రాయలసీమ పరిశీలించడం జరిగింది.

"ఇచట నొకనాడు పండె ముత్యాల చాలు అటనొకప్పుడు నిండె కావ్యాల జాలు; అచ్చట నొకప్డు కురిసె భాష్యాల జల్లు; విరిసెనాటి నాడు వేయంచు విచ్చుకత్తి! ఇది గతించిన కథ; వినిపింతు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

నింక నేటి రాయలసీమ కన్నీటిపాట కోటిగొంతుల కిన్నెర మీటుకొనుచు కోటిగుండెల కంజరి కొట్టుకొనుచు”

ఈ కిన్నెరను మీటింది విద్వాన్ విశ్వం. ఈ కంజరిని కొట్టింది పెన్నేటిపాట. 1954లోనే రాయలసీమ కన్నీటిపాటను గానంచేసిన కావ్యం ఇది. రాయల యుగం స్వర్ణయుగం అయితే అవ్వచ్చు గాక, ఆనాడు -ముత్యాల చాలు పండితే పండొచ్చు గాక; కావ్యాల జాలు నిండితే నిండొచ్చుగాక; భాష్యాలజల్లు కురిస్తే కురవచ్చుగాక; కొందరు చరిత్రకారులు ప్రవచించిన గత వైభవాల మీద కవికి భ్రమలు లేవు. అందుకే ఆనాటి ప్రాభవాన్ని “ఇది గతించిన కథ" అని ఒక్కమాటలో పక్కనపెట్టాడు. ఈనాటి రాయలసీమ కన్నీటిపాటను కావ్యం నిండా ఆలపించాడు. రాయలసీమవాసులనే కాదు, ఇతర ప్రాంతీయులను కూడా కంటనీరు పెట్టించాడు.

చారిత్రకభ్రమల్లో గాక, వాస్తవంలో బ్రతుకు ఈడుస్తున్న ఏ కవీ 'గతకాలము మేలు'గా భావించలేడు. ఒకనాటి విశ్వంగారిలోనే కాదు, ఈనాటి రాయలసీమకవిలోనూ ఆ గొంతును స్పష్టంగా వినగలం.

“రాయలనాటి వైభవాలను పూడిపోయిన రాయల చెరువులను చరిత్రలో తవ్వితీసి దుత్తలు మానెత్తికి ఎత్తుతున్నారు. వర్తమానం గతాన్ని అధిగమించడం కాదిక్కడ గతం వర్తమానాన్ని అధిగమిస్తోంది" - (రుద్రసీమ - రాఘవశర్మ)

సహజ పరిణామానికి భిన్నమైన పరిస్థితి రాయలసీమది. ఈ వ్యతిరిక్త పరిణామానికి కవులకు ఆగ్రహంరావడం ధర్మమే! చరిత్రను అనుమానించడమూ సహజమే!

"రాయలకాలంలో రత్నాలరాశులు పోశారో లేదో తెలీదు గానీ, మేము మాత్రం ప్రాణాల్ని రాళ్ల కుప్పలుగా పోసుకున్నాం. మా కళ్లల్లో ఉబికే నీళ్లు మా ఊరి బావుల్లో ఊరితే ఆశలొదిలేసిన ఎముకలగూళ్లలో మృత్యువు సాలెగూళ్ళు కట్టేది కాదు" (కన్నీటిసీమ - ఎన్. ఈశ్వర్ రెడ్డి)

రాయలకాలంలో రత్నాలను రాసులుగా పోసి వీధుల్లో అమ్మేవారని చరిత్రకారులు చెప్పుతున్నట్లుగా మనం వింటున్నాం. నిజానికి రత్నాలను రాళ్లుగా పోసి అమ్మారో; లేదా రాళ్లనే రత్నాలుగా నమ్మించారో అన్నది రాయల కాలాన్ని, ఆనాటి చారిత్రక, సామాజిక స్థితిగతుల్ని వాస్తవికదృష్టితో అధ్యయనం చేసిన వారికి వస్తున్న అనుమానం. 'కన్నీటి సీమ' కవితలో కవి రాయలకాలంలో రత్నాల రాసులు పోశారో లేదో తెలియదని' అన్నాడు. కానీ, నిజానికి కవి తెలిసి

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

అన్న మాటే అది. అది నిజమే అయితే, ఈనాటి రాయలసీమ ఎముకలగూళ్లలో మృత్యువు సాలెగూళ్లు కట్టేది కాదని కవి చెప్పకనే చెప్పాడు.

శ్రమ విలువను గుర్తించడమే కాక, శ్రమ పునాదుల పైనే సమస్తరంగాలు నిర్మితమవుతాయన్న వాస్తవాన్ని గ్రహించడం అభ్యుదయవాదుల లక్షణం. శ్రమ చుట్టూ సీమ జీవితాలు గూడుకట్టుకొని ఉన్నప్పుడు సీమకవులు శ్రమవిలువను గుర్తించడం, గౌరవించడం ఆశ్చర్యమనిపించుకోదు.

భావ శిల్పం: చిత్రం అంటే బొమ్మ అని అర్థం. కళ్లతో చూసి, చేతులతో తాకి, మనసుతో ఆస్వాదించ కలిగేది చిత్రం. చిత్రలేఖనంలో, శిల్పంలో చిత్రాలు భౌతికంగా మనకు కనిపిస్తాయి. కవిత్వంలోని చిత్రాలు కంటికి కనిపించవు. భావనలో మాత్రమే అవి రూపుకడతాయి. కవిత్వంలో చెప్పిన కొన్ని వర్ణనలను చిత్రలేఖనం ద్వారా చిత్రించవచ్చు. కానీ కొన్ని ఆలోచనలను బొమ్మగా వేయలేం. వాటికి మనసులోనే అస్పష్టచిత్రం ఏర్పడుతుంది. ఈ అనుభవం వ్యక్తిగతంగా హృదయాంతరాళాల్లో అనుభవించాల్సిందే తప్ప బయటికి చూపలేం. లోలోపల కవిత్వం బొమ్మకట్టే విధానాన్నే భావచిత్రం అంటారు. భావాలతో చిత్రించే చిత్రమే భావచిత్రం. అక్షరాల ద్వారా పాఠకుని మనస్సులో 'బొమ్మ' ఏర్పడేటట్లు చేసేదే భావచిత్రం.

"రచయిత చిత్రించదలచుకున్న సమస్యను శక్తివంతంగా, సంగ్రహంగా, ధ్వనిమయంగా చెప్పటానికి తోడ్పడే శిల్పసాధనం 'భావచిత్రం'' (యస్.యస్.నళిని; సాహిత్యవిమర్శ పదాల డిక్షనరీ, పుట. 132).

ఇంగ్లీషులో భావచిత్రాలను 'ఇమేజస్' అనే పేరుతో పిలుస్తున్నారు. భావచిత్రాలలో అలంకారికత చోటు చేసుకుంటుంది. భావచిత్రాలను కవితాశిల్పంలో ప్రధానమైనవిగా చెప్పుకోవాలి. భౌతికంగా అనుభవం కాని వాటిని ఆలోచనల ద్వారా అనుభవంలోకి తీసుకొచ్చి పాఠకునిలో రసపుష్టికి దోహదం చేసేవి భావచిత్రాలు. భావచిత్రాలు ఎక్కువగా కవిత్వంలో ఉపయోగించి రాసే కవిత్వాన్ని భావచిత్రవాదం అంటారు.

రాయలసీమ అభ్యుదయ కవిత్వంలో చక్కటి భావుకత దర్శనమిస్తుంది. రాయలసీమ అభ్యుదయకవుల కవితల్లోని భావపదచిత్రాల్ని ఎనిమిది రకాలుగా విభజించి పరిశీలించవచ్చు. అవి

1) ప్రకృతి సంబంధ భావపదచిత్రాలు

2) పశుపక్షాదులకు సంబంధించిన భావపదచిత్రాలు

3) వ్యక్తి సంబంధ భావపదచిత్రాలు

4) జలసంబంధ భావపదచిత్రాలు

5) కళల సంబంధ భావపదచిత్రాలు

6) కాలసంబంధ భావపదచిత్రాలు

7) భాషాసంబంధ భావపదచిత్రాలు

8) సృజనాత్మక భావపదచిత్రాలు

**ప్రకృతి సంబంధ భావపద చిత్రాలు :** వాస్తవ దృష్టితో చూస్తే ప్రకృతితో సంబంధం లేని భౌతికాంశాలేవీ వుండవు. అడవులు, చెట్లు, చేమలు, పశువులు, పక్షులు, నదులు, సముద్రాలు, చివరికి మనుషులు కూడా ప్రకృతిలో భాగాలే.

రాయలసీమ అభ్యుదయకవులు ప్రకృతిప్రేమికులు. ప్రకృతిని చూసి పరవశించని వాళ్లెవరూ ఉండరు. రాయలసీమకవులు కూడా ప్రకృతిని పరిహరించి కవిత్వం చెప్పలేదు. వాళ్ల కవిత్వంలో ఆకాశం, మేఘాలు, పొలాలు, చివరికి ఎడారి స్పృశించబడ్డాయి. భావపదచిత్రాలు నిర్మించడంలో ప్రకృతి బాగా దోహదం చేస్తుంది. అలా ప్రకృతి సంబంధమైన భావపదచిత్రాలను రాయలసీమ కవులు చాలా చిత్రించారు.

'అమృతం పంచుకుంటూ' అన్న కవితలో కొండలకు నీటి ముడుపుల్ని చెల్లించుకోవాలనుకునే మేఘాలు, పాలరంగుకు ప్రత్యామ్నాయంగా నలుపురంగును పులుముకునే నదులు, హంసనడక ల్లాంటి వాటి ప్రవాహం వంటి వర్ణచిత్రాన్ని తలపింపచేసే పదచిత్రం ఎలాంటిదో చూడండి.

కొండలు సముద్రానికి నీటి ముడుపులు కట్టాలనుకున్నాయేమో మేఘుమాలికల్ని పిండి మ్యానింగ్ నదిని పుట్టించాయి! పాలరంగుకు ప్రత్యామ్నాయంగా వుండాలనుకున్నదేమో నది నల్లరంగు పులుముకుంది నడకచూస్తే రాజహంస అడుగులు గుర్తొస్తాయి అలాంటిదే చలికాలం గురించి తెలియజేసే భావపదచిత్రం. చలిని తట్టుకోలేక చెట్లు ఆకుల్ని కప్పుకున్నాయి బండల గుండెలపై మంచు కమ్ముకుంది చంద్రుడు పిండివెన్నెల పరిచి మేఘుమాలికల్తో దోబూచులాడుతున్నాడు.

'నీతి ఉప్పుపాతర' కవితలో అవినీతి గురించి చెబుతూ నీతి మూలంగా స్వాభిమానానికి 'చిన్నతనం', అంతస్తుకు 'అథశ్చిహ్నం', వంటివి వుంటాయని, అవినీతి పగలు 'నిండు హరితంగా', రాత్రి పండువెన్నెలై విజృంభిస్తున్నదని చెప్పిన సందర్భంలో ఒక మంచి భావపదచిత్రాన్ని కూడా గీస్తాడు కవి.

"ఆవిరై ఆకాశపు అమ్మగారింట మేఘాల్ని కంటూంది నదులు, కాలువలు, సరస్సులు, సముద్రాలై నేల పునీతమౌతుంది"

'దారిన నడవాలంటే' అనే కవితలో మొగిలిపొదలను, వాటిచుట్టూ తిరిగే మిన్నాగులను ఒక పదచిత్రంలో చిత్రించడం జరిగింది.

ఆ దారి నడవాలంటే భయంగా వుంది దారి పొడవునా దట్టంగా కమ్మిన మొగిలిచెట్లు సువాసనలు వెదజల్లుతూ కనిపించే మొగిలిరేకులు పరిమళాలు మనస్సును మత్తెక్కిస్తూంటే పొంచి వున్న మిన్నాగులు గుర్తొస్తున్నాయి. కోరికోరి మిత్తవను ఎవడూ కొనుక్కోడు

'మూగజీవి మౌనభాష' కవితలో గ్రామీణ వాతావరణాన్ని, పల్లెక్రీడల్ని, పాడిపంటల్ని చిత్రించిన భావపదచిత్రం కూడా కళ్లకు కట్టినట్టు వుంటుంది.

"పంటకాలువలో నిశీధివేళ నీటినిండా చంద్రుని పంట పచ్చని పొలాలపై తివాసీలు పరిచి పిండారబోస్తుంది రేయెండ పైరగాలి పొలాలపై వాహ్యాళి చెట్లు కోతి కొమ్మచ్చికి పిలుపు చెడుగుడు ఆటలో పట్టుబడ్డవాడి పెనుగులాట చూసి భూదేవి బాధపడ్డా పట్టువదలని విక్రమార్కుడై ఎల్లదాటి గెలుపు గ్రీష్మంలో పొలాలు క్రీడాస్థలాలై బిళ్లంగోడుకు ఆహ్వానం పల్లెచుట్టూ గాలిపటాల పక్షుల్ని చూసి సాగే మేఘాలు ఆగి చూసిన చోద్యం

ఇంటింటా పంట రాసులు పొలాల్లో రాల్చిన శ్రమ జలఫలాలు పశుపక్ష్యాదులకు సంబంధించిన భావచిత్రాలు"

భారతదేశం వ్యవసాయదేశం. ఒకప్పుడు వ్యవసాయం బాగా సాగేది. ఏ పల్లె చూసినా, జనావాసాలతో, ఏ ప్రాంతం చూసినా పచ్చటిపంటపైర్లతో ప్రకృతి కళకళలాడేది. ప్రతి పల్లెలోను భూములు స్థిరాస్తి అయితే చరాస్తిగా పశువులుండేవి. రైతుల పంటపొలాల నాశించి ఎన్నో పక్షులు వస్తుండేవి. పక్షుల కిలకిలారావాలతో పగలు పక్షుల పండుగ వాతావరణం కనిపించేది. ఈనాడు కరువులవల్ల వ్యవసాయం దెబ్బతింది. పైగా జలవనరులున్న ప్రాంతంలోను రైతులు సేద్యం

ఎంతకాలం చేయాలి అనుకొని మట్టి పూసుకొని పలుగులు, పారలు చేతబట్టి, నాగళ్లతో దుక్కి దున్నే ఓపిక లేనితరం వచ్చేసింది. పైగా ఏడాది పొడుగునా కష్టపడినా గిట్టుబాటుధర లభించని దిగుబడులు. ఇన్ని కారణాలవల్ల నీటి వ్యవసాయం దెబ్బతింది. వ్యవసాయాధారిత జీవులైన పశువులు పల్లెల్లో కనుమరుగైపోతున్నాయి. ఇలాంటి తరుణంలో వాటి గురించి తెలుచుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ నిజాన్ని గ్రహించిన సీమకవులు తమ కవిత్వంలో పశుపక్ష్యాదుల్ని కూడా సందర్భానుసారంగా చిత్రించడానికి ప్రయత్నించారు.

పశుపక్ష్యాదులాధారంగా ప్రకృతి పరిస్థితుల్లో, ఊహల్లో తేలిపోతూ అల్లిన భావచిత్రాల్ని సీమకవుల కవిత్వంలో దర్శనమిస్తాయి.

'భూగోళమంత బాల్యం' అనే కవితలో 'మాకు ప్రాంతాలు లేవు, సరిహద్దులు లేవు, లక్ష్మణరేఖలు లేవంటూ, పరుగులు తీసే మేఘాలకు ఎవ్వరూ పరుగులు నేర్పరనీ," ఆ విధంగా చక్కని గూడును నిర్మించుకునే నైపుణ్యాన్ని ఎవరూ నేర్పలేదనీ చెపుతాడు కవి.

"పుల్ల పుల్లను ఏరి పదిలంగా మోసి చిటారుకొమ్మన గూడుకట్టి ఆకుల పరుపులు పరచి ఆకాశహర్మ్యంలో కాపురం చేస్తున్న విధం పక్షి కెవడు నేర్పాడు"

ఈ కవితాచరణంలో పక్షి శ్రమ సౌందర్యాన్ని వర్ణించడం ఒక విశేషం.

ఒక దళితవాడ అగ్నికి ఆహుతైపోతే, వారి జీవితాలకు ఆధారమైన పశువుల గురించి చెప్పిన భావపదచిత్రం ఆలోచింప చేస్తుంది.

" పలుపు విప్పని జంగిలిగొడ్ల మోరెత్తి ఎదురుచూస్తుంటే ఎద్దు మెడల్ని ఇంకా అలంకరించి మువ్వల పట్టెళ్లు చిలక్కొయ్యకు వేలాడుతున్నాయి. కొట్టం మలమూత్రాలరొచ్చుమయమై కడగని కక్కసుకు ప్రతిరూపమైతే మేరుపర్వతమై వచ్చిపడే పచ్చిగడ్డి మోపు జాడేలేదు అందుకు కారణాలు అనేకం కాదు హరిజనవాడ అగ్నికి ఆహుతికావడ. "

**ఆధార గ్రంథాలు :**

ఆవేద: జూపల్లి ప్రేమచంద్ వాయిస్ ప్రచురణలు 1999

పెనుగొండ లక్ష్మి : పుట్టపర్తి నారాయణాచార్యులు 1962

ఆంధ్ర మహాభారతం- ఛందః శిల్పం, పాటిబండ్ల మాధవశర్మ అభినవభారతి ప్రచురణ - 1966

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-4, (Oct,Nov,Dec), 2025

మేఘదూతము: పుట్టపర్తి నారాయణాచార్యులు 1963

ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు : కె.కె. రంగనాథాచార్యులు ఆంధ్ర సారస్వత పరిషత్ హైదరాబాదు

పెన్నేటి పాట: విద్వాన్ విశ్వం 1956

ఆధునికాంధ్ర కవితాసమీక్ష కె.వి.ఆర్. నరసింహం గంగాధర పబ్లికేషన్స్, విజయవాడ

రాయలసీమ సమాజం సాహిత్యం : బండి నారాయణ స్వామి

తెలుగులో కవిత్వోద్యమాలు:  తెలుగు ఆకాడమి

అభ్యుదయం (సాహిత్య వ్యాసాలు).